హైదరాబాద్ వార్త

నేటి నుండి ప్రభుత్వ అధీనంలోకి మెట్రోరైల్

-రూ.1.462 కోట్లకు ప్రభుత్వానికి అప్పగింత -నిత్యం నాలుగున్నర లక్షల మందికి సేవలు

హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్న ఎట్టకేలకు పీపీపీ మోడల్ నుంచి ప్రభుత్వ అధీనంలోకి వచ్చిది. ఎల్ఆండ్‌టీ ఆధీనంలో ఉన్న మెట్రోరైల్‌ను దాదాపు రూ. 1.462 కోట్లతో వందశాతం ప్రభుత్వం కొనుగోలు చేసింది. నిర్మాణంలో కూడా అనేక అడ్డంకులను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. నిత్యం నాలుగున్నర లక్షల ప్రయాణికులకు సేవలు అందించిన మెట్రోరైల్ ఎట్టకేలకు ప్రభుత్వ ఆస్తిగా మారింది. ప్రైవేటు ఆధీనంలో ఉన్న మొదటి దశ మెట్రోతో రెండో దశలో చేపట్టనున్న మెట్రో రైలు మార్గాలతో అను సంధానం చేయడం అతి పెద్ద అడ్డంకిగా మారడంతోనే రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశను స్వాధీనం చేసుకోవాల్సివచ్చింది. మే 1న అంటే నేడు దీనిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఢిల్లీ తర్వాత దేశంలో రెండో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్ హైదరాబాద్ మెట్రో గుర్తింపు పొందింది. కాని ఆ తరువాత బెంగళూరు, ముంబై, పుణే, నాగపూర్ వంటి నగరాలు కూడా మెట్రోరైల్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. మెట్రోరైల్ ప్రతీరోజు దాదాపు నాలుగున్నర లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో నగర ప్రయాణికులకు మరిన్ని సేవల విస్తరణకు హైదరాబాద్ మెట్రోరైల్ స్వాధీనం చేసుకోవడంతోనే రెండో దశ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. పటిష్టమైన లక్ష్యంతోనే ప్రభుత్వం మెట్రోరైల్‌ను నిర్వహించాలని నిర్ణయించుకుంది. మెట్రోరైల్ ప్రారంభం అయిన తరువాత ఇప్పటి వరకు దాదాపు 90కోట్ల ప్రయాణికులకు సేవలు అందించింది. 2010లో మెట్రోరైల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎల్ఆండ్‌టీ నిర్మాణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిర్మాణ దశలో కూడా అనేక ఆటు పోట్లను ఎదుర్కొంది. నగర వాసులకు అత్యాధునిక రవాణా వ్యవస్థను అందించడంలో ప్రముఖ పాత్ర పోషించింది. దాదాపు 9సంవత్సరాలకు పైగా విశిష్ట సేవలు అందించిన ఎల్ఆండ్‌టీ మెట్రోరైల్‌ను ప్రభుత్వానికి అప్పగించి వైదొలగింది.

ఎల్ఆండ్‌టీ మెట్రోను 2072 వరకు కొనసాగించాల్సి ఉన్నా...

నగర ప్రయాణికులకు అత్యాధునిక, అత్యుత్తమైన ప్రయాన సౌకర్యాన్ని అందించడం కోసం ఏర్పాటైన మెట్రోరైల్ మెట్రోరైల్‌ను కొనసాగించే గడువు ఉన్నా మే1న ప్రభుత్వానికి అప్పగించింది. దాదాపు 60సంవత్సరాలపాటు మెట్రోను నడిపేందుకు ఒప్పందం ఉంది. కాని కేవలం 9సంవత్సరాలలోనే ఎల్ఆండ్‌టీ మెట్రోను వదులుకుంది. 29 నవంబర్ 2017 నుంచి మూడు కారిడార్లలలో మెట్రోరైల్ దాదాపు 69.2కిలోమీటర్ల మేరకు సేవలు అందిస్తోంది. జేబీఎస్ నుంచి ఫలక్‌నూమా వరకు పనులు పూర్తి చేయాల్సి ఉండగా కారిడార్ 2లో పనులను ఎంజీబీఎస్ వరకే పూర్తి చేశారు. కొన్ని వివాదాల కారణంగా ఇంకా 5.5 కిలోమీటర్‌ల నిర్మాణం జరపాల్సి ఉంది. సేవలు అందించే క్రమంలో కూడా మెట్రో ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంది. కోవిడ్ సమయంలో కూడా దాదాపు ఆరు నెలల పాటు డిపోలకే పరిమితం కావాల్సివచ్చింది. దీంతో తీవ్ర నష్టాలు చవిచూడాల్సివచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అప్పటి ప్రభుత్వం రూ. 9వందల కోట్లు వడ్డీలేని రుణాన్ని అందజేసి ఆదుకుంది. మెట్రోరైల్ నిర్మాణ ఒప్పందంలోనే 35సంవత్సరాలకు కుదిరింది. మళ్ళి 4 జూలై 2022న మరో 25సంవ్సరాలకు ఒప్పందాన్ని పొడిగించారు. ఈ క్రమంలో 2072 వరకు దాదాపు మరో 53సంవత్సరాలు ఉన్నప్పటికి నిర్మాణ దశ నుంచే అనేక అవాంతరాలు, నష్టాలు చవిచూడడంతో ఎల్ఆండ్‌టీ మనాసపు త్రికైన మెట్రోను వదులుకోవాలనుకుంది. మెట్రో నిర్మాణ సమయంలో స్టేషన్లు, స్టేషన్లు, డిపోలకు కాకుండా వాణిజ్య అవసరాల కోసం మూడు కారిడార్లలో ఎల్ఆండ్‌టికి 212 ఎకరా లను అప్పటి ప్రభుత్వం ఇచ్చింది. డిపోల కోసం మరో 57 ఎకరాలు మెట్రోస్టేషన్‌ల వద్ద వాహనాల పార్కింగ్, ఇతర అవసరాల కోసం ఇచ్చారు. ఇందులో రెండు ఎకరాలు వివాదంలో ఉండడం వల్ల మొత్తం 267 ఎకరాలు ఎల్ఆండ్‌టీ ఉప యోగించుకునేలా ఒప్పందం కుదిరింది. కాగా ఇందులో రెండువందల ఎకరాలు ఉప్పల్ డిపో, మియాపూర్ డిపోకోసం వినియోగించారు. రాయ దుర్గం, హైటెక్‌సిటీ, మాదాపూర్, మూసారం బాగ్, ఎర్రమంజిల్, పంజాగుట్ట మెట్రో మాల్స్, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేశారు. రాయదుర్గంలో మాత్రం మెట్రో 15ఎకరాలను 50 సంవత్సరాల పాటు సబ్ లీజుకు ఇచ్చింది. ఇందుకోసం దాదాపు రూ. 12వందల కోట్లు తీసుకుంది. ఈ సొమ్మును మెట్రో నిర్మాణంలు ఉపయోగించారు. ఇవన్ని పోగా మరికొంత భూమి మిగిలి ఉంది. మొదటి దశ మెట్రోరైల్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే స్థిర, చర ఆస్తులు ప్రభుత్వపరం కానున్నాయి.

దోపిడీకి గురవుతున్న కష్టం

కార్మికుల హక్కులను కాలరాస్తున్న యాజమాన్యాలు

కనీస వేతనాలు అమలు చేయని ప్రభుత్వాలు

మేడే వేడుకలకు కార్మికులు,కర్షకులు,శ్రామికులు సన్నద్ధం

నేడే కష్టజీవుల పండుగ..

హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త: పొట్టకూటి కోసం పలుగు పారలెత్తి చెమటను చిందించిన శ్రమ జీవులకు పండుగ..దోపిడీ దారుల దురాగతాలకు వ్యతికింగా శ్రామికులు పిడికిలి ఎత్తిన రోజు మేడే. హక్కుల కోసం పోరాటాన్ని మరింత శక్తివంత చేసేందుకు కార్మిక వర్గం నినదించింది ఈరోజునే. పోరుబాటలో అసువులు బాసిన అమరవీరులకు వసంతపు నివాళులు అర్పించి, ప్రపంచ కార్మికులు సమిష్టితత్వంతో పోరాడి హక్కులు సాధించుకున్న మేడేను ఘనంగా నిర్వహించేదుకు కార్మిక సంగాలు ఏర్పాటు చేస్తున్నా న్నాయి. ఎనిమిది గంటలే పనిచేయించుకోవాలని అమెరికాలోని చికాగో నగరంలో 1886 మే1న జరిగిన కార్మిక వర్గ ప్రదర్శ నపై యాజమాన్యాల ప్రోత్బలంతో ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించింది. ఆపోరాటంలో ఎంతో మంది కార్మికులు ప్రాణాలు విడిచారు. ఆప్రాంత మంతా రక్తసిక్తమైంది. ఆరక్తంలో తడిచిన గుడ్డనే ఎర్రజెండాగా కార్మికులు ఎగురవేసారు. ఇది కార్మికులకు అండగా నిలిచి నిటి నుంచి నేటి వరకు పోరాడుతోంది. అప్పటినుంచి ప్రతిఏడాది మే ఒకటిన మేడే దినోత్సవాన్ని కార్మికలోకం నిర్వహిస్తోంది. రాజ్యాంగం, కార్మికులకు ఎన్నోచట్టాలు కల్పించినప్పటికీ వాటిని అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాడితే నిర్భందాన్ని ప్రయోగిస్తున్నారు.

మొదటి మేడే జరిగిన తీరు..

కార్మికవర్గ కార్యక్రమాలు బాగాపెరిగాయి. వారి చైతన్యం పెరిగింది. ఐరోపా దేశాల్లో పెద్దసంఖ్యలో సమ్మె పోరాటాలు సాగాయి. ఎన్నికలు, పార్లమెంటరీ రంగాల్లో కార్మిక వర్గం ఎన్నోవిజయాలను సాధించింది. ప్యారిస్ మహాసభ ఇచ్చిన పిలుపుతో ఐరోపా అమెరికాలో ఎన్నడూ లేని ఉత్సాహం దారి తీసింది. 1890 మేడే నాడు ఐరోపా అంతటా పారిశ్రామిక నగరాల్లో లక్షలాది మంది కార్మికులతో వీధులు నిండిపోయాయి. జర్మనీ,డెన్మార్క్, ఫ్రాన్‌లోని అనేక నగరాలలో కార్మికులు ఫ్యాక్టరీల్లో సమ్మె చేసి అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ప్రకటించారు. అనేక నగరాల్లో సామూ హిక ప్రదర్శనలు సాగాయి. చిన్నదేశాలైన మియన్మాంలో లక్షమంది, బుడాఫెస్ట్‌లో 66వేల మంది,మార్సెల్స్‌లో 50వేలమంది, ప్రాగ్‌లో 30వేల మంది.స్టాక్‌హోం, చికాగో నగరాల్లో పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు. స్పెయిన్ బ్రిటన్‌లలో మే4వ తేదీన అంతర్జాతీయ సౌహార్ధతను ప్రదర్శించారు. బార్సెలోనాలో లక్షమంది ప్రదర్శన సాగింది. జర్మనీలో మే4న జరిగిన ప్రదర్శనలో ఏంగెల్స్ పాల్గొన్నారు. అయితే మే1వ తేదీన మొదటి మేడే సందర్భంగా ఇటలీలో పోలీసులతో ఘర్షన జరిగింది. ఆతర్వాత సంవ్సరాలలో ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్ దేశాలలో ఘర్షణలు సాగాయి. ఉత్తర ఫ్రెంచి నగరమైన ఫోర్మిస్‌లో శాంతియుతంగా సాగే మేడే ప్రదర్శనలపై రైఫిల్ కాల్పులు జరిగాయి. 60మంది స్త్రీ, పురుషులు అక్కడి కక్కడే మరణించారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

-ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లతో మహిళా సాధికారతకు ప్రోత్సాహం

ఎంఆర్ క్రిష్ణ రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

రహదారులను ఆక్రమిస్తూ భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం అల్వాల్ లోతుకుంట, గోల్నాక, రాజీవ్ నగర్, అల్వాల్ చెరువు ప్రాంతాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అల్వాల్ లోతుకుంటలో కొంతమంది భవన యజమానులు రహదారిపైకి ర్యాంపులు నిర్మించి ఆక్రమణలు చేపట్టినట్లు గమనించిన కమిషనర్, వాటిని తక్షణమే తొలగించి సెట్‌బ్యాక్ క్లియర్ చేసి ప్రజల వినియోగానికి రహదారులను పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశించారు. వాణిజ్య సంస్థల ట్రేడ్ లైసెన్స్‌లను సమీక్షించి, అమలు ప్రక్రియను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజా రవాణాకు అడ్డుగా ఉన్న చిన్నచిన్న దుకాణాల ఆక్రమణలను కూడా తొలగించాలని ఆదేశించారు.గోల్నాక ప్రాంతంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను పరిశీలించిన ఆయన, పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను సమీక్షించారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు, చెత్తను వెంటనే తొలగించి పరిశుభ్రతను కాపాడాలని సిబ్బందిని ఆదేశించారు. కాలనీలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను సందర్శించి వృద్ధులకు అందుతున్న సేవలను పరిశీలించారు.అలాగే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించి నిర్వహణ, పరిశుభ్రత, ఆహార నాణ్యతను పరిశీలించారు. మహిళా సాధికారతకు తోడ్పడటంతో పాటు ప్రజలకు చౌక ధరల్లో ఆహారం అందించడంలో ఈ క్యాంటీన్ల పాత్రను ఆయన ప్రశంసించారు. అల్వాల్ చెరువు పరిసరాల్లో మరియు సమీప నాళాల్లో దోమల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు గుర్తించిన కమిషనర్, ఫాగింగ్ పెంచడం, నాళాల డిసిల్టింగ్, యాంటీ లార్వల్ చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీ, డీఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, రాంకీ ప్రతినిధులు, ఈపీఆర్‌టీఐ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోండి..

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పిల్లలు, యువతలో క్రీడా స్ఫూర్తి, శారీరక దారుఢ్యం పెంపొందించేందుకు సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు సర్కిళ్లలో ఏర్పాటు చేసిన ఈ క్యాంపుల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు.హుడా పార్క్ (ఎస్.ఆర్.రావు నగర్), మల్లాపూర్ సీడీఎస్ భవనం, మల్లాపూర్ పీజీ, ఎదులాబాద్ వాలీబాల్ గ్రౌండ్, బోయిన్‌పల్లి నెహ్రూ నగర్ ప్లే గ్రౌండ్, నాగారం తెలంగాణ క్రీడా ప్రాంగణం, ఆరికే పురం టీచర్స్ కాలనీ, గోల్నాక, మోలాలి, మల్కాజ్‌గిరి యునైటెడ్ క్లబ్ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో కరాటే, రోలర్ స్కేటింగ్, కిక్‌బాక్సింగ్, క్రికెట్ వంటి క్రీడల్లో నిపుణులైన కోచ్‌లు శిక్షణ అందిస్తున్నారు.ఈ క్యాంపుల ద్వారా పిల్లల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడం, శారీరక సామర్థ్యాన్ని పెంపొందించడం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే మంచి అవకాశమని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాభోధన అందాలి

-అధికారులు పాఠశాలల తనిఖీలు నిరంతరం చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆల

హైదరాబాద్, ఏప్రిల్ 30,ప్రభాతవార్త:

జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. జిల్లా విద్యాధికారి రోహిణి, సంబంధిత అధికారులు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 2,886 పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 9,53,850 మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారుల ద్వారా కలెక్టర్‌కు తెలిపారు.ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీలు, విద్యార్థుల హాజరు, పరీక్ష ఫలితాలు వంటి అంశాలను కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 800 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతోందని, దీని ద్వారా 57,387 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని అధికారులు వివరించారు. భోజన నాణ్యత, అందించే మెనూ పై కలెక్టర్ సమీక్షించి, నాణ్యతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు అవసరమైన చోట తరగతి గదుల విస్తరణ, అభివృద్ధి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల పురోగతిని సమీక్షించేందుకు తరచుగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే బోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం పాఠశాలలకు కార్పొరేట్ పాఠశాలలతో సమానంగా వసతులు కల్పిస్తున్నందున, ఫలితాలు కూడా అదే స్థాయిలో రావాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవి ధంగా విద్యాధికారులు, ఉప విద్యాధికారులు పాఠశాలలను నిరంతర తనిఖీలు నిర్వహించేలా చూడాలని సూచించారు. పర్యవేక్షణలో ఎటువంటి నిరక్ష్యం ఉండకూడదని, పక్షం రోజులకు ఒకసారి (ఫోర్ట్‌నైట్) సమీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరు శాతం 100కి చేరేలా చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఏడి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఇఓ లు, సెక్టోరియల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక, డిఈవో రోహిణి తదితరులు

టెన్త్ పలితాలలో చతికిలపడ్డ బండ్లగూడ, చార్మినార్ జోన్లు

- బహదూర్‌పురాలో స్వల్ప మెరుగు

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

- పది ఫలితాలపై తీవ్ర ప్రభావం

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త : బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో పాతబస్తీలోని బండ్లగూడ, చార్మినార్ జోన్లు చతికిల పడ్డాయి. గత ఏడాది 2025తో పోలిస్తే వెనుకంజలో ఉన్నాయి. ఒక్క బహదూర్‌పురా జోన్ మాత్రం స్వల్పంగా మెరుగుపడింది. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం తీసుకున్న నిర్ణయాలు బండ్లగూడ, చార్మినార్ జోన్లపై పెద్దగా ప్రభావం చూపనట్లు కనిపిస్తున్నాయి. దీనికి డిప్యూటీ ఈవోలు, ఐఎఎస్‌ల మార్పు, ప్రధానోపాధ్యాయుల, ఉన్నతాధికారుల సరియైన పర్యవేక్షణ లేక పోవటం వంటి పలు కారణాలు తోడైయ్యాయి. 2026లో జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్షలకు బండ్లగూడ జోన్‌లోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి 578 మంది విద్యార్థులు హాజరైయ్యారు. వీరిలో 449 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైయ్యారు. 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత యేడాది 2025లో జరిగిన వార్షిక పరీక్షలకు 547 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 445 మంది ఉత్తీర్ణులై 81 శాతం పది పాసైయ్యారు. వరుసగా రెండేళ్ళ ఫలితాల శాతాన్ని పరిశీలిస్తే ఈ సారి మూడు శాతం తగ్గుదల కనిపిస్తుంది. అదేవిధంగా 2026లో చార్మినార్ జోన్‌లోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి 453 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 352 మంది పాసైయ్యారు. మొత్తం మీద 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత యేడాది 2025లో 16 ప్రభుత్వ పాఠశాలల నుండి 375 మంది విద్యార్థులు హాజరు కాగా 330 మంది ఉత్తీర్ణులైయ్యారు. మొత్తం మీద 88 శాతం ఉత్తీర్ణత పొందారు. గత రెండేళ్ళ శాతాన్ని పరిశీలిస్తే పది శాతం ఉత్తీర్ణత తగ్గింది. 2026లో బహదూర్‌పురా జోన్‌లోని 26 ప్రభుత్వ పాఠశాలల నుండి 798 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 669 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైయ్యారు. జోన్‌లో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత 2025లో 26 ప్రభుత్వ పాఠశాలల నుండి 798 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే వారిలో 616 మంది పాసై 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2025తో పోలిస్తే 2026లో ఏడు శాతం వృద్ధి కనిపించింది. రాష్ట్రస్థాయి ఫలితాల పట్టికలో హైదరాబాద్ జిల్లా చివరగా 33వ స్థానంలో నిలువటం వెనుక ఇలాంటి సంఘటనలు కొన్ని తోడైతున్నాయి. పాతబస్తీలాంటి సునిశితమైన ప్రాంతాలలో కొందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వేళకు రాకపోవటం, వచ్చినా పాఠాలు చెప్పక పోవటం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఎఫ్ఆర్ఎస్ సైతం వీరిని మార్చలేక పోతుంది. విధులు సక్రమంగా నిర్వహించని వారిని దారిలో పెట్టాల్సిన స్థానిక డిప్యూటీ ఈఓలు, ఐఎఎస్‌లు, జిల్లా విద్యాశాఖ అధికారులు పెద్దగా పట్టించుకోక పోవటం వల్ల ఫలితాలపై ప్రభావం చూపుతుంది. జిల్లా యంత్రాంగం ప్రారంభంలో కొంత హడావిడి చేసినా ఆ తరువాత వివిధ కారణాలతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం నిర్వహించే పది ప్రత్యేక తరగతులు అంతంత మాత్రంగానే నిర్వహించారు. అయినా పది విద్యార్థులు కొందరు మాతృభాష (ప్రథమ భాష) రాయటం, చదవటంలో వెనుకబడటం విద్దూరం. కొన్ని పాఠశాలలు మాత్రం చదువుపై శ్రద్ధ చూపాయి. ఫలితాలలో వృద్ధి చెందారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫారమ్, మధ్యాహ్న భోజనం, ఉచిత విద్యాబోధన, స్పెషల్ మెటీరియల్ వంటి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇక వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు అల్పాహారం అందించబోతున్నారు. ఇప్పటికే అత్యాధునిక పానల్ (డిజిటల్) బోర్డులపై విద్యనందిస్తున్నారు. ఇంత చేసినా ఫలితాలలో కొన్ని పాఠశాలలు వెనుకబడటం విచారకరమని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

భార్య మోసానికి బలై పోయిన టెకీ..

-హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య

-మొదట ఆత్మహత్యగా భావించిన పోలీసులు..

-అనంతరం వెలుగులోకి వచ్చిన భార్య అరాచకాలు

-సంచలనం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం ఆత్మహత్య

-19పేజీల సూసైడ్‌నోట్‌లో భార్య గురించి విస్తుపోయే నిజాలు

బేగంపేట ఏప్రిల్ 30,ప్రభాతవార్త

హైదరాబాద్‌లో సంచలనం రేపింది. సాఫ్ట్‌వేర్ (టెకీ) ఇంజనీర్ సీతారాం ఆత్మహత్య కేసు మలుపులు తిరుగుతూ సాగుతుంది.సహచర ధర్మ చారిణిగా ఉండాల్సిన భార్య ప్రవర్తన కారణంగా సీతారాం తన నిండు జీవితాన్ని మధ్య లోనే ముగించాల్సిన దుస్థితి.మృతుడు రాసిన 19పేజీల లేఖలో ఉన్న సమా చారం ఆధారంగా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.ఈ కేసులో పోలీసులు సీతారాం భార్య రేణుకతో పాటు ఆమెతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నా రమణారెడ్డి,శ్రవణ్‌లను అరెస్ట్ చేసారు.ఈ ఏడాది ఫిభ్రవరిలో సీతారాం హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.ఇది సాధారణ ఆత్మహత్యగా భావించిన సెక్రటేరియట్ పోలీసులు అనుమానాస్పద మృతి గా భావించారు.అనంతరం వెలుగులోకి వచ్చిన 19పేజీల సూసైడ్ నోట్‌లో అతను తన భార్య రేణుక ప్రవర్తనే తన ఆత్మహత్యకు ప్రధాన కారణంగా పేర్కొన్నాడు.తన భార్యకు పలువురితో అక్రమ సంబంధాలు ఉన్నాయని, వాటిని తట్టుకోలేకే తాను ఆత్మహత్య నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నాడు.తన భార్య ఒక్కరితో కాకుండా ఏడాదిన్నర కాలంలోనే ముగ్గురు వ్యక్తులతో అక్రమ సంబంధాలు కొనసాగించిందని లేఖలో పేర్కొన్నాడు.వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తులతో ఆమె ఏకాంతంగా ఉన్న సమయంలో వీడియోలు కూడా రికార్డు చేసిందని వాటిని రమణ అనే వ్యక్తి ఇన్‌స్టాలో పోస్ట్ చేసాడని లేఖలో సీతారాం ఆవేదన వ్యక్తం చేసాడు.వీడియోలు చూసిన తర్వాతే తన భార్య అసలు రూపం తనకు తెల్సిందన్నారు.నెలకు రెండు లక్షల జీతం సంపాదిస్తూ భార్యను ఎంతో అపురూపంగా చూసుకున్నానని,ఒక మధ్య తరగతి వ్యక్తిగా భార్యను గుడ్డిగా నమ్మడమే నేను చేసిన పాప మాఅని,తన చావుకు భార్య ప్రవర్తనే కారణమని ఆయన లేఖలో స్పష్టం చేసారు. 19పేజీల మరణ వాగ్మూలం సాక్ష్యంగా పోలీసులు రేణుకతో పాటు ఆమెకు సహ కరించిన ప్రియులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ ఘటన టెక్కీల జీవి తాల్లోనే మరో కోణాన్ని వెల్లడించింది.ఈ ఘటన చివరికి ఎటు మలుపు తిరుగుతుందో చూడాలి.

ముందే జాగ్రత్త..

పాత భవనాలు కూలే ప్రమాదముంటే...

హైడ్రా 9000113667కు ఫోన్ చేయండి

హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:

నివాలతో పాటు.. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న కట్టడాలుంటే 9000113667కు సమాచారం అందించాలని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో కోరింది. కూలడానికి సిద్ధంగా ఉన్న పురాతన భవనాలను ముందే గుర్తించి భద్రంగా కూల్చేయడం ద్వారా ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. బెంగళూరులో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి శివాజీనగర్‌లోని బోవ్రింగ్ అండ్ లేడీ కర్జన్ ఆసుపత్రి సమీపంలోని ప్రహరీ కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. అలాగే మన నగరంలో కూడా పురాతన భవనాలు కూలి ప్రాణ నష్టం సంభవించిన ఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా హైడ్రా ముందస్తు జాగ్రత్తలు చేపడుతోంది. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నామని ప్రజలు కూడా ఇందులో భాగస్వామ్యమై.. సమాచారం అందివ్వాలని కోరింది. ఏ ప్రాంతంలో ఉంది... ఆ భవనం లేదా కట్టడం ఫొటోతో పాటు.. కరెంటు లొకేషన్‌ను పై నంబరుకు షేర్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హైడ్రా తెలిపింది. వర్షాకాలంలోనే పురాతన భవనాల ముప్పు పొంచి ఉంటుందనే ఆలోచనలో ప్రజలు ఉండొద్దని.. అకాల వర్షాలు పడుతున్న వేళ ఎప్పుడైనా ప్రమాదం ఉంటుందని గ్రహించి సమాచారం ఇవ్వాలని కోరింది. శిథిలావస్థలో ఉన్న భవనాలు, కట్టడాల సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

లీలాద్రి క్షేత్రంలో ఘనంగా నరసింహస్వామి జయంతి

శ్రీ నరసింహ స్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు..

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

ఆల్విన్ కాలనీ సమీపంలో గల తులసి నగర్ శ్రీ లీలాద్రి క్షేత్రం శ్రీ లీలాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో గురువారం శ్రీ నరసింహస్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ పుణ్య కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి దివ్య దర్శనం చేసుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారి అనుగ్రహాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య వడ్డేపల్లి రాజేశ్వరరావుని సత్కరించి ఆశీర్వదించారు. దేశం, రాష్ట్రంలోని ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి కలగాలని ఆయన ప్రార్థించారు.

కూకట్‌పల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు...

ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు దంపతులు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

కూకట్‌పల్లిలోని శ్రీ రామాలయం వద్ద శ్రీ గరుడ హనుమద్ మూర్తులు స్థాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం శాంతి పాఠం, మూలమంత్ర హవనాలు, వైభవేష్టి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సన్మానం చేసి దేవాలయం మెమెంటో అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, రామాలయం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎన్ శ్రీనివాసరావు (తులసిరావు) దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే విజయం సాధ్యం

ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ఉత్తీర్ణులైన పదవతరగతి విద్యార్థులను అభినందిస్తున్న తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ముషీరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త: విద్యార్థులు కష్టపడి చదివితే తప్పకుండా విజయం సాధిస్తారని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్, ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ పదవ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులవగా, ఏ1 గ్రేడ్ 11 మంది సాధించటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షలు 134 మంది వ్రాయగా అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల కృషితో ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ పి.స్వర్ణలతతో కలసి ఆయన ఏ1 గ్రేడ్ సాధించిన విద్యార్థులను బొకేలతో సత్కరించి, అభినందించారు.

విహెచ్‌కు శుభాకాంక్షలు తెలిపిన లక్‌పతి

ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన విహెచ్‌ను అభినందిస్తున్న పిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సందర్భంగా పిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ సలహాదారు పదవితో పాటు క్యాబినెట్ హోద్దాను కూడా ప్రభుత్వం కల్పించడం సంతోషం వ్యక్తం చేశారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న హనుమంతరావు సేవలను ప్రభుత్వ పాలనలో వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిలకు యాదగిరిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం,మక్కల కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితులు

కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాస్ తదితరులు

కార్వాన్,ఏప్రిల్30(ప్రభాతవార్త) రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధాన్యం,మక్కల కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని తెలంగాణ భారతీయ జనతా పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాస్ అన్నారు.గుడిమల్కాపూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవర మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల గోడును పట్టించుకునే వారే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ పూర్తి అబద్ధాలేనని,ప్రజలను తప్పదారి పట్టించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు.కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్‌అనేది లేనేలేదన్నారు.రైతుల వద్ద విద్యుత్ చార్జీలు వసూలు చేయాలని మోడీ సర్కార్ ఎక్కడా చెప్పలేదన్నారు.రైతు సంక్షేమానికే మోడీ సర్కార్ కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

జనగణనలో ఖచ్చితమైన డేటా లేకుంటే నష్టం : గుజ్జ సత్యం

హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రారంభమైన జనగణన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై బీసీ వర్గాల్లో చర్చలు ముమ్మరమవుతున్నాయి. డిజిటల్ విధానంలో సాగుతున్న ఈ ప్రక్రియ భవిష్యత్ సంక్షేమ విధానాలపై నేరుగా ప్రభావం చూపనున్న నేపథ్యంలో సామాజిక వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బీసీల వాస్తవ పరిస్థితులు గణాంకాల్లో ప్రతిబింబిస్తాయా లేదా అన్నది కీలకంగా మారింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ 'బీసీల వాస్తవ పరిస్థితులు ప్రభుత్వానికి తెలియాలంటే ఖచ్చితమైన డేటా తప్పనిసరిఅని, గతంలో సరైన గణాంకాలు లేకపోవడం వల్ల అనేక వర్గాలు నష్టపోయాయని పేర్కొన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కులగణనలో చిన్న తప్పిదం కూడా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఇది కేవలం ఆన్‌లైన్ నమోదు కాదు..భవిష్యత్ విధానాల బేస్ అని పేర్కొన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక స్థితి సరిగ్గా ప్రతిబింబించాలంటే ప్రజలే ముందుకు వచ్చి ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అవగాహన, ఇంటర్నెట్ సౌకర్యాల లోపం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. వీజీఆర్ నారగోని మాట్లాడుతూ, జనగణనలో సేకరించే సమాచారం భవిష్యత్ అభివృద్ధి దిశను నిర్ణయిస్తుందని అన్నారు. తప్పు డేటా ఆధారంగా తీసుకునే నిర్ణయాలు సమాజానికి నష్టం చేస్తాయి. అందుకే ప్రతి వ్యక్తి సరైన సమాచారం ఇవ్వాలి, అని సూచించారు. కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ, సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో డిజిటల్ అంతరాలు ప్రధాన సవాలుగా మారుతున్నాయని అన్నారు. ఇంటర్నెట్, డిజిటల్ అవగాహన లేకపోవడం వల్ల అనేక మంది నమోదు చేయలేకపోతున్నారు. గ్రామ స్థాయిలో వలంటీర్లు, హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలు మే 11లోగా ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని, అనంతరం ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ధృవీకరిస్తారని తెలిపారు. హెల్ప్‌లైన్ 1855 కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా ఓబీసీ ఇన్‌చార్జ్ సూర్యనారాయణ, అఖిలభారత యాదవ సంఘం అధ్యక్షులు రాములు యాదవ్, సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.రాజ్నారాయణ ముదిరాజ్, మట్ట జయంతి గౌడ్, పుష్పలీల గౌడ్, శివ యాదవ్, మహేష్ యాదవ్, జిల్లా నరేందర్, జయరాజ్ పాల్గొన్నారు.

జనగణనపై జరిగిన బిసి సంఘాల సమావేశంలో పాల్గొన్న గుజ్జ సత్యం, వీజీఆర్ నారగోని,కత్తి వెంకటస్వామి తదితరులు

భారతీయ సంస్కృతికి కళలు ప్రతీకలు

-పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త

చిక్కడపల్లి ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఎన్నో ఏళ్ళు విదేశీ పాలనలో ఉన్నా భారత దేశ సంస్కృతీ సంపద గా కళలు ప్రతీకలు గా నిలిచి ఉన్నాయని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై కథక్ కళా క్షేత్ర అధినేత పండిట్ నిర్వహణలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా దేశ శాస్త్రీయ నృత్య కళలు ప్రదర్శన జరిగింది సమీక్ష నందిని కథక్ నృత్యం అభినయ జ్యోతి నృత్యాలయ సంస్థ పద్మజ శిష్యులు భరత నాట్యం సంయుక్త ఘోష్ కథక్ నృత్యం నృత్యపురి డాన్స్ అకాడమీ గురువు సమిష్ట శిష్య బృందం ఒడిస్సీ పేరిణి సందీప్ తన శిష్య బృందం తో పేరిణి కళా కృష్ణ శిష్యులు ఆంధ్ర నాట్యం మయూరి రాధ శిష్యులు కూచిపూడి నృత్యాలు చూడ ముచ్చటగా నర్తించారు ఈ సందర్భం గా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ మాట్లాడుతూ కళలను జీవన విధానం గా మార్చుకోవాలని సూచించారు ప్రజలతో పాటు ప్రభుత్వం కూడా కళా సంస్థలకి సహకారం అందించాలని కోరారు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ విభిన్న ప్రాంతాల్లో వారి వారి సాంస్కృతిక నేపథ్యం లో నృత్య ప్రక్రియలు ఉన్నాయి అని తెలిపారు అన్ని ప్రాంతాల నృత్య ప్రక్రియలు ఒకే వేదిక పై కి అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భం గా తీసుకు రావడం లో ప్రసిద్ధి కథక్ కళా క్షేత్ర అని అభినందించారు ప్రఖ్యాత నాట్య కళాకారిణి సరళ కుమారి మాట్లాడుతూ నేడు కళా కారులు ప్రచారం కి అనేక మాధ్యమాలు ఉన్నాయి అన్నారు నృత్యం చేసే సమయం లో కళా కారులు సాహిత్యం లోని భావం తెలుసుకుని నిమగ్నం కావాలనీ సూచన చేశారు సంస్థ అధ్యక్షుడు కథక్ అంజి బాబు స్వాగతం పలికారు

నృత్య కళాకారులను సత్కరించిన దృశ్యం

నిమ్స్‌లో ముగిసిన రక్త మార్పిడి సేవల శిక్షణ శిబిరం

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 30, ప్రభాతవార్త:

నిమ్స్ హాస్పిటల్‌లోని ట్రామా బ్లాక్ ఆడిటోరియంలో ఏప్రిల్ 21 నుండి 29 వరకు నిర్వహించిన రక్త మార్పిడి సేవల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, ఇమ్యునోహెమటాలజీ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. విభాగాధిపతి డా. సుధీర్ కుమార్ వుజిని నేతృత్వంలో ప్రొఫెసర్ డా. బి. శాంతి, అడిషనల్ ప్రొఫెసర్లు డా. మహేష్ కుమార్, డా. మురళీ కృష్ణ సెషన్లను నిర్వహించారు. సీనియర్ రెసిడెంట్లు డా. నీహారిక, డా. హర్షిత, డా. పుష్పజ, డా. శ్వేత, డా. మోనికతో పాటు ల్యాబొరేటరీ టెక్నీషియన్ బిడుగు శేఖర్ ల్యాబ్ డెమాన్‌స్ట్రేషన్ సెషన్లలో పాల్గొన్నారు. సిద్ధాంతపరమైన అంశాలతో పాటు ప్రాక్టికల్ శిక్షణను సమర్థవంతంగా అందించారు. తెలంగాణ వ్యాప్తంగా వివిధ రక్త కేంద్రాల నుండి 66 మంది వైద్యాధికారులు, 94 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 65 మంది నర్సింగ్ సిబ్బంది కలిపి మొత్తం 225 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. బ్లడ్ బ్యాంక్ విధానాలు, అత్యవసర రక్తమార్పిడి పద్ధతులు, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్‌లోని నూతన సాంకేతికతలపై వారికి శిక్షణ ఇచ్చారు. డీజీహెచ్ ఎస్, టీజీఎస్ ఏసీఎస్, ఎస్‌బీటీసీ, ఎన్‌బీటీసీ సంస్థల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమాన్ని టీఎస్బీటీసీ సభ్య కార్యదర్శి డా. రవి కుమార్, టీజీఎస్‌ఏసీఎస్ నుండి డిప్యూటీ డైరెక్టర్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూషన్ సర్వీసెస్ డా. కృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్స్ ,టెక్నీషియన్స్, నర్సింగ్ స్టాఫ్, నిమ్స్ బ్లడ్ సెంటర్ నుంచి టెక్నికల్, నర్సింగ్ విద్యార్థులు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో నిమ్స్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన ఉద్యోగులను నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప సన్మానించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ దయాకర్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, డా. మార్త రమేష్, హెచ్‌ఆర్‌డి స్టాఫ్ ఏ ఎన్ జ్యోతి శైలజ, శాంతి, కేజియా వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు వారి బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని సత్కరించారు.

పదవీవిరమణ పొందిన ఉద్యోగులతో డాక్టర్ నగరి బీరప్ప తదితరులు.

నేత్రపర్వంగా విద్యాపరంపర జాతీయ శాస్త్రీయ నృత్యోత్సవం

జ్యోతిప్రకాసనంచేసి నృత్యోత్స వాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

నాంపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

ప్రాచీన కాలం నుండి పారంపర్యంగా వస్తున్న భారతీయ శాస్త్రీయ నృత్యకళలను ప్రోత్సహిస్తూ భావితరాలకు అందించాలని ప్రముఖ యక్షగాన కంఠీరవ నాట్యగురు డా. పసుమర్తి శేషుబాబు అన్నారు. అంతర్జాతీయ నృత్యదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ నృత్యశిక్షణా సంస్థ గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో విద్యాపరంపర శీర్షికన జాతీయ శాస్త్రీయ నృత్యోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డా. పసుమర్తి శేషుబాబు విశిష్ట అతిథులు లయన్ డా. సత్యనారాయణ సంగిశెట్టి, పద్మాకళ్యాణ్, పసుమర్తి ఉదయ్‌భాస్కర్ తదితర అతిథులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి నృత్యోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. తరచు ఇలాంటి గురుశిష్య సంప్రదాయాన్ని చాటిచెప్పేలా పలు కార్యక్రమాలు నిర్వహించడం హర్షదాయకమన్నారు. మున్ముందు మరిన్ని ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సభకుముందు విద్యాపరంపర జాతీయ శాస్త్రీయ నృత్యోత్సవంలో ప్రముఖ గురువులు పద్మకళ్యాణ్, డా. బి.కిరణ్మయి, డా. జ్యోతిశేఖర్, స్నేహశర్మ, సుధారాణి, శ్రీలక్ష్మి శంకరి, పసుమర్తి సాయిదీపిక శిష్యులు పలుఅంశాలను అద్భుతంగా ప్రదర్శించి కళాప్రియులను, ఔత్సాహిక ప్రేక్షకులను తన్మయుల్ని చేశారు.

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా శ్రీధర్

హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :

బాధ్యతల స్వీకరిస్తున్న సి.శ్రీధర్

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి శ్రీధర్ ఉత్తర్వులను అందుకున్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు.ఇదిలా ఉండగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా నియమితులైన సి.శ్రీధర్‌కు మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది. శ్రీధర్ నేతృత్వంలో పెండింగ్ పనులన్నీ సకాలంలో పూర్తి కానున్నాయని మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం ఉన్న ఉన్నతాధికారి, శ్రీధర్ కమి షనర్‌గా నియమితులు కావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.మినిస్టీరియల్ స్టాఫ్ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ వెలిబుచ్చారు.

ప్రజా సమస్యలపై స్పందించండి

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :

నర్కి పూల్‌బాగ్‌లోని తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశమైన నూతన జెడ్సి సత్యనారాయణ

జీహెచ్‌ఎంసి చార్మినార్ జోన్, నూతన జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ గురువారం వివిధ విభాగాల అధికారులతో సమావేశమైయ్యా రు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, మలేరియా, వీధి దీపాలు, యూసీ డీ తదితర విభాగాల అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహిం చారు. అభివృద్ధి, నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, కచ్చామోరీలు, నాలాల నిర్వా హణ, దోమల సమస్య, పట్టణ పేదల సంక్షేమం, స్వయం సహాయక సంఘాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెడ్సి సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజా సమ స్యలపై తక్షణమే స్పందించాలన్నారు. సమావేశంలో అధికారు లు ఇందిరా, ఈఈ షేక్ సనావుద్దీన్, యాదగిరి, మాధవి, శ్రీనివాస్, వెంకట్ రాజు, నవీన్ కుమార్, రంజిత్ కుమార్ రెడ్డి, శ్రీరాములు, సత్యనారాయణ రెడ్డి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బిసిల డిమాండ్లపై ప్రధాని మోదీ ప్రకటన చేయకపోతే పర్యటనను అడ్డుకుంటాం

హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం కులగణనతోపాటు బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు, కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సహించేది లేదని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ నరేం ద్రమోదీ ప్రధాన మంత్రి అయిన తరువాత బిసిల పరిస్థితి పొయ్యి మీద పెనం మంటల్లో పడ్డట్టు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బిసిల డిమాండ్లను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బిసిల రిజర్వేషన్‌లు 42 శాతంకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. మోదీ తెలంగాణ రాష్ట్రంలో పర్యటించే ముందు బిసిల డిమాండ్లపై ప్రకటన చేసి రావాలని ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆయన పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. మే నెల 2వ తేదీన అన్ని రాజకీయ పార్టీలు, బిసి సంఘాలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, మే 9న ప్రధాని పర్యటను వ్యతిరేకిస్తూ ఇందిరాపార్కు వద్ద 'మహా నిరసన' కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించకుండా చేతులు దులుపుకోవాలని చూస్తే రాష్ట్రంలోని కోట్లాది మంది బిసి సహించేది లేదన్నారు. ఈ సమావేశానికి బిసి విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ అధ్యక్షత వహించగా, బిసి నేతలు గుజ్జ కృష్ణ, నాగుల శ్రీనివాస్‌యాదవ్, కోలా జనార్ధన్, జక్కుల వంశీకృష్ణ, సతీష్, నాగేష్; నందగోపాల్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న బిసి నేతలు మధుసూదనాచారి , సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, రామకృష్ణ తదితరులు

ప్రతి విద్యార్థికి అత్యున్నత ప్రమాణాలతో విద్య అందించడమే లక్ష్యం

- మంత్రి వివేక్ వెంకటస్వామి

-అంబేద్కర్ కాలేజీకి జాతీయ గౌరవం.. విద్యాక్షేత్రంలో అరుదైన మైలురాయి

చిక్కడపల్లి ఏప్రిల్ 30, ప్రభాతవార్త : నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న డా. బి.ఆర్. అంబేద్కర్ డిగ్రీ కాలేజీకి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. ఎడ్యుకేషనల్ వరల్డ్ జ్యూరీ అవార్డ్స్‌లో భాగంగా వైవిధ్యం, ఇంక్లూషన్, సమానత్వం, ఈక్విటీ ఛాంపియన్ విభాగంలో దేశవ్యాప్తంగా 6వ ర్యాంకును కైవసం చేసుకోవడంపై కాలేజీ చైర్మన్, రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి హర్షం వ్యక్తం చేశారు. గురువారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, ఈ విజయం కేవలం ఒక ర్యాంకు మాత్రమే కాదని, బాబాసాహెబ్ అంబేద్కర్ గారు కలలుగన్న సామాజిక సమతుల్యతను సాధించే దిశగా బలమైన అడుగు అని పేర్కొన్నారు. వైవిధ్యం, సమానత్వంలో 6వ ర్యాంకు రావడం గర్వకారణం. కులమతాలకు అతీతంగా ప్రతి విద్యార్థికి అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామనే దానికి ఇదే నిదర్శనమని అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే వినోద్ తదితరులు

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న కాలేజీ సీఈఓ, డైరెక్టర్, ప్రిన్సిపల్, ఫ్యాకల్టీ సభ్యుల అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ అవార్డు తమపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మన కాలేజీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్, సెక్రటరీ (బెల్లంపల్లి ఎమ్మెల్యే) జి. వినోద్, బోర్డు సభ్యులు పాల్గొని కాలేజీ సాధించిన ఘనతను కొని యాడారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

జూనియర్ అసిస్టెంట్ పదవీ విరమణ

యాదగిరి దంపతులకు సత్కారం

అల్వాల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఆముదాల యాదగిరి ఉద్యోగ విరమణ మహోత్సవం ఘనంగా జరిగింది. మూడు దశాబ్దాలకు పైగా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధులు, థర్డ్ జెండర్ విభాగంలో ఆయన సేవలు అందించారు. లోతుకుంట ఇందిరానగర్ రాఘవరావు కమ్యూనిటీ హాల్‌లో ఐసిడిఎస్ అల్వాల్ ప్రాజెక్టు, వికలాంగుల సంఘాలు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో యాదగిరి దంపతులను ఘనంగా సత్కరించారు. జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ వికలాంగుల సమస్యలు పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు.

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు.

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 30, ప్రభాతవార్త:

బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్ ప్రాంతంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన చేశారు. రూ.1.43 కోట్ల వ్యయంతో జీ+2 అంతస్తుల భవనంగా ఈ కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి నర్సింహరావు, శ్రీనివాస్ గౌడ్, జీహెచ్‌ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్, ఏఈఈ వెంకటేశ్, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ హెల్త్ సెంటర్ ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

ఫోన్ స్నాచర్స్ ఆట కట్టించిన మహంకాళీ పోలీసులు

24గంటల్లోనే నలుగురు నిందితులను అరెస్ట్, బైకులు,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

బేగంపేట ఏప్రిల్ 30,ప్రభాతవార్త :

నగరంలో వరస మొబైల్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠా సభ్యుల ఆటకట్టించారు మహంకాళీ పోలీసులు.కేవలం 24గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు బైకులు,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బెంగుళూరుకు చెందిన పల్లె ప్రశాంత్ కుమార్ ఈ నెల 29న పని నిమిత్తం సికింద్రాబాద్ వచ్చాడు.ప్యాట్నీ ఎక్స్‌రోడ్డు నుంచి బస్సు దిగి నడుచుకుంటూ జేబీఎస్ వైపు వెళ్తున్నాడు.ఇదే సమయంలో నెంబర్ ప్లేట్ లేని యాక్టివాపై వచ్చిన ముగ్గురు దుండగులు ఆతని చేతిలోని మొబైల్ ను లాక్కొని పరారయ్యారు.బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసారు.సికింద్రాబాద్ జోన్ అడిషినల్ డీసీపీ జె.నర్సయ్య,ఏసీపీ శ్రీధర్,ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు.నిందితులలో నేరేడ్ మెట్ కు చెందిన ప్రధాన సూత్రధారి నడిగ రాకేష్ తో పాటు మోకటి అభినేష్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు బైకులు,రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.మరో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నడుస్తూ ఫోన్ మాట్లాడే వారే లక్ష్యంగా వీరు సెల్ ఫోన్ దొంగతనాలు చేస్తుంటారని,వీరిపై నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లలో 8కేసులు నమోదై ఉన్నాయన్నారు.నిందితుల నుంచి మూడు యాక్టివాలు,రెండు సెల్‌ఫోన్లు,స్వాధీనం చేసుకున్నారు.అత్యంత వేగంగా కేసును ఛేదించిన డిఎస్పై ప్రసాదరెడ్డి, ఎస్సై సందీప్ రెడ్డి క్రైం సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

సెంట్రల్ ఉద్యోగి ఒకరు.. వాటర్ బిల్ పేరుతో మరొకరు

- సైబర్ నేరస్థుల వలలో చిక్కుకున్నారు.

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 30, ప్రభాతవార్త:

బంజారాహిల్స్ పరిధిలో ఆన్‌లైన్ మోసాల ఘటనలు పెరుగుతున్నాయి. తాజాగా రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మోసగాళ్ల బారినపడి మొత్తంగా రూ.80 వేలకుపైగా నష్టపోయారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెట్టుబడి పేరుతో మోసం

బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఇన్‌కమ్ ట్యాక్స్ క్వార్టర్స్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి బ్రజేష్ మీనా (30) టెలిగ్రామ్‌లో విఐపి గ్రూపు పేరుతో ఉన్న గ్రూప్ ద్వారా మోసపోయాడు. ఏప్రిల్ 28న ఆ గ్రూప్‌లో వచ్చిన ప్రకటనను నమ్మి ఒక వ్యక్తితో సంప్రదింపులు జరిపాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిస్తామని, అధిక లాభాలు వస్తాయని చెప్పి మొదట రూ.25,000 బదిలీ చేయించారు. అనంతరం లాభాలు వచ్చాయని చెప్పి, వాటిని పొందాలంటే బ్రోకర్ ఛార్జీలు పేరిట మరో రూ.30,000 చెల్లించాలని కోరారు. అలా మొత్తం రూ.55,000.05 చెల్లించిన తర్వాత మోసగాళ్లు స్పందించడం మానేశారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

వాటర్ బిల్ పేరిట మోసం

మరో ఘటనలో బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరా నగర్‌కు చెందిన భవాని సునీల్ లాల్ (34) వాటర్ బిల్ పేరిట మోసపోయాడు.ఏప్రిల్ 27న హైదరాబాదు మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ పేరుతో ఒక మెసేజ్ వచ్చిందని, బిల్ చెల్లించకపోతే నీటి కనెక్షన్ నిలిపివేస్తామని హెచ్చరించారు. మొదట రూ.13 చెల్లించమని చెప్పి, తరువాత ఒక ఏపీకే ఫైల్ పంపించి, దాన్ని డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. అది నమ్మి డౌన్‌లోడ్ చేసి డెబిట్ కార్డు వివరాలు నమోదు చేయగానే ఖాతా నుంచి నాలుగు విడతల్లో మొత్తం రూ.25,004 డెబిట్ అయ్యాయి. విషయం తెలు సుకున్న బాధితుడు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నార్సింగి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : బుధవారం నార్సింగి పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో ఉన్న ఆదిత్యా విల్లాస్ సమీపంలో ఓ పురుషుడి మృతదేహం ఉందని స్థానికులు గుర్తించి 100.కు ఫోన్ చేసి సమాచారం అందించారు. 100.నుంచి నార్సింగి పోలీసులకు ఈ విషయం తెలిసింది. నార్సింగి పెట్రోలింగ్-3 వాహనంలో విధులు నిర్వహిస్తున్న రవీందర్, రమేష్‌లు ఇద్దరు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహంను పరిశీలించారు. మృతుడి ఒంటిపై లేత గోదుమ రంగు చొక్కా, ముదురు మెరూన్ రంగు ప్యాంట్ ఉన్నాయని, మృతుడు 50-55.సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉంటాడని తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతంలో ఈ మృతదేహంపై ఆరా తీస్తే ఎవరూ గుర్తించలేదని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే నేరుగా నార్సింగి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైనర్ బాలికతో వృద్ధుడు అసభ్య ప్రవర్తన

తల్లితండ్రుల ఫిర్యాదుతో గాంధీనగర్‌లో కేసు నమోదు

ముషీరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త: ఒక మైనర్ బాలికపై వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కవాడిగూడ తాళ్లబస్తీకి చెందిన 8 సంవత్సరాల బాలిక వేసవి సెలవలు కావటంతో బుధవారం ఉదయం వాళ్ల ఇంటి బయట మెట్ల వద్ద ఆడుకుంటూ ఉంది. ఆ ఇంట్లో రెండవ అంతస్థులో నివాసం ఉంటున్న అశోక్ (62) అనే వృద్ధుడు, బాలికను పైన ఆడుకుందువు రమ్మని పిలిచి, బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. వృద్ధుని ప్రవర్తనతో భయపడిన బాలిక అతన్నుంచి తప్పించుకుని, తన ఇంటికి వచ్చి, తల్లి తండ్రులకు ఫిర్యాదు చేసింది. బాలిక తెలిపిన వివరాల ప్రకారం ఆమె తల్లి తండ్రులు, వృద్ధునిపై గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లి తండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

మెరుగైన వైద్యానికి సింఆర్ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

మెరుగైన వైద్యానికి ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త: పేద ప్రలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు.బాలంరాయి ప్రాంతానికి చెందిన ప్రవీణ్ సతీమణి రాజేశ్వరికి రూ.4 లక్షలు, లోతుకుంట ప్రాంతానికి చెందిన యాదగిరి భార్య లావణ్యకు రూ. 3 లక్షలు,కార్యానకు చెందిన రాజు కుమార్తె నళినికి రూ.5.50 లక్షల ఎల్ఓసీ మంజూరు పత్రాలను గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకొని వారు త్వరగా కోలుకొని ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఏడు గుళ్ల దుర్గమాత ఆలయంలో ఘనంగా పూజలు

బోయిన్‌పల్లి ఏడు గుళ్ల దుర్గమాత ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లి ఏడు గుళ్ల దుర్గమాత అమ్మవారి ఆలయ ధ్వజ స్థంబ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణంలో పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. బిజెపి నాయకుడు టీ.మురాలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వడి బియ్యం సమర్పన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓం ప్రకాశ్ యాదవ్, వరప్రసాద్, ముఖేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోబోజెన్ఎక్స్ ఒలింపియాడ్ పోటీలు

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

నిజాంపేట్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

అసెండ్ ఇనిషియేటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి క్రీడా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోబోజెన్ఎక్స్ ఒలింపియాడ్ పోటీలు విద్యార్థుల్లో శాస్త్రం, సాంకేతికతపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ పోటీల ద్వారా రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, డ్రోన్ సాంకేతికత వంటి ఆధునిక రంగాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ పోటీలపై అవగాహన కల్పించేందుకు నిజాంపేట్‌లోని అసెండ్ ఇనిషియేటివ్స్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి క్రీడా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాండు రంగ రుక్మాకర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో సాంకేతిక రంగంలో ముందంజలో నిలవాలంటే ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ ఒలింపియాడ్‌లో పాఠశాల నుంచి కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి ప్రతిభను వెలికితీసే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తోంది.పోటీల్లో విజేతలకు ప్రమాణపత్రాలు, పతకాలు, నగదు బహుమతులతో పాటు జాతీయ స్థాయి అవకాశాలు కూడా కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఆసక్తి గల విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు.మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నంబర్లు: 9490908212, 6300231865

ఈతలో గోల్డ్ మెడల్ సాధించిన అంకిత గౌడ్‌కు ఘన సన్మానం

జీడిమెట్ల, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

అంకిత గౌడ్‌ను సన్మానిస్తున్న రవీందర్ ముదిరాజ్

సూరారం ప్రాంతానికి చెందిన రవికుమార్ గౌడ్ కుమార్తె ఎం. అంకిత గౌడ్ (15) ఈతలో అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌తో పాటు సీఎం కప్‌ను సాధించడం అభినందనీయమని పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు.అంకిత గౌడ్ తన కృషి, పట్టుదలతో ఈతలో ఉన్నత స్థాయికి చేరుకోవడం ఎంతో సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా చదువులో కూడా ప్రతిభ కనబరిచి, ఏడవ తరగతి వరకు చదివి నేరుగా పదవ తరగతి పరీక్షలు రాసి 458 మార్కులు సాధించడం విశేషమని కొనియాడారు.ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఈత వంటి క్రీడలను అలవాటు చేసుకోవాలని, అంకితభావంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. చదువుకు వయస్సు అడ్డంకి కాదని, ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా నేర్చుకోవచ్చని అన్నారు.అంకిత గౌడ్ విజయంలో భాగస్వాములైన దీక్ష స్కూల్ యాజమాన్యానికి కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

విహెచ్‌ను అభినందించిన శంభుల శ్రీకాంత్‌గౌడ్

ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన విహెచ్‌ను అభినందిస్తున్న పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, చిత్రంలో ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శంభుల ఉషశ్రీకాంత్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి హోదాలో నియమితులైన వి.హనుమంతరావును పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ అభినందించారు.గురువారం గాంధీభవన్‌లో విహెచ్‌కు ఆయన శాలువ, పుష్పగుచ్ఛాంతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, జంగీరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీజనాభా గణంకాల్లో జరిగిన లోపాలను సరి చేయాలి : సంకి రవిందర్

విలేకర్ల సమావేశంటో మాట్లాడుతున్న కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) జనాభా గణంకాల్లో తీవ్రమైన అన్యాయం జరుగుతుందని జాతీయ,తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమీషన్‌లకు ఫిర్యాదు చేసినట్లు వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబు తెలిపారు. గురువారం మహేంద్ర హిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగణనలో జరిగిన లోపాలపై దర్యాప్తు చేయాలని,రాబోయే జనగణనకు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంపై అవగాహన సదస్సులు చేపట్టాలన్నారు. గణంకాల దృవీకరణకు బలమైన క్రాస్ చెకింగ్ విధానం చేపట్టాలన్నారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణకు న్యాయమైన ప్రతినిధి ఏర్పాటు చేయాలన్నారు. కంటోన్మెంట్‌లో నియోజకవర్గంలో మాల,మాదిగ, అర్వమాల వంటి ఎస్సీ ఉపకులాలు 4వ వంతు జనభగా ఉన్నాయని తెలిపారు. అందు వల్ల తగ్గుదల గణంకాలు అనుమానస్పదంగా ఉన్నాయన్నారు. వత్యాసాలు,సంక్షేమ పథకాలు, విధాన ప్రాణాళిక,సామాజిక న్యాయంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని తెలిపారు. తన ఫిర్యాదు మేరకు ఎస్సీ కమీషన్ స్పందించి జనగణ ఉన్నతాదికారులకు,జిహెచ్ఎంసి కమిషనర్‌కు నోటీసులు జారీ చేసిందన్నారు. 10 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఎస్సీ కమీషన్ ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. 2001 నుంచి 2011 మధ్య కాలంలో 5.72 శాతం పెరిగినప్పటికి ఎస్సీ కులాల జనాభా 25.39 శాతం తగ్గినట్లు నివేదికలు పంపడం సరైంది కాదన్నారు. ఈ తప్పిదాలను సరి చేసుకోవాలని ఆయన తెలిపారు.కార్యక్రమంలో వికాస్ మంచ్ ప్రతినిధులు జి. రమేష్, సాయికుమార్,అంబాల శ్రీనివాస్, సంతోష్, నవీన్,మహేష్, దామోదర్,క్రిష్ణ,మహ్మద్ ఘసీ పాల్గొన్నారు.

మే 5న రవీంద్రభారతిలో "కుమ్మరి సర్పంచ్"ల అభినందన సభ

-బిసి సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు సంగెం సూర్యరావు

హైదరాబాద్,ఏప్రిల్ 30,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కుమ్మరి కుల ముద్దుబిడ్డలు 94 మంది సర్పంచులుగా గెలుపొందారు వారికి మే 5వ తేదీన ఉదయం 10 గంటలకు రవీంద్ర భారతి హైదరాబాద్ లో తలపెట్టిన సర్పంచుల అభినందన సభను విజయవంతం చేయాలని బీసీ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు సంగెం సూర్యరావు గురువారం పిలుపునిచ్చారు. గురువారం మీడియా సెంటర్లో జరిగిన సమావేశంలో మే 5న జరిగే అభినందన సభ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ సూర్యారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కుమ్మరులు ఆర్థికంగా,రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారనీ తెలంగాణ రాష్ట్రంలో కుమ్మరి కులానికి చెందవలసిన హక్కుల కోసం నిరంతరం బీసీ సమాజ్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందన్నారు. మన జాతి మనుగడ కోసం బీసీ సమాజ్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేపట్టి కుమ్మర కులానికి రావలసిన హక్కులను ప్రభుత్వం నుండి సాధించే దిశగా పోరాటం కొనసాస్తామన్నారు. బీసీ సమాజ్ యూత్ సెక్రటరీ కొల్లూరి అర్జున్ మాట్లాడుతూ ఇప్పటివరకు రాజకీయంగా ఎదగలే దని ..కుమ్మరి సమాజం భవిష్యత్తులో తప్పనిసరిగా చట్టసభల్లో స్థానం సంపాదించే వరకు ఈ ఉద్యమం నడుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సమాజ్ గౌరవ అధ్యక్షుడు శివార్చక విజయ్ కుమార్,రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాసాగర్, సర్పంచుల అభినందన సభ ఆహ్వాన కమిటీ సభ్యులు కుమ్మరి లక్ష్మీనారాయణ, మల్లెల ఉషారాణి, నిమ్మలూరి శ్రీనివాస్, కర్ణల శ్యాంకుమార్, గి.రి.శ్రీనివాస్, ఆషాడపు దేవేందర్, కుమ్మరి శ్రీనివాస్, కొత్తపల్లి గంగాధర్, కుమ్మరి సాయిలు, తోటపల్లి బాలామణి, కుమ్మరి బుగ్గన్న, కే. శివ గంగ గుడిపల్లి, ఎన్ మల్లికార్జున్, కుమ్మరి రమేష్ బాబు, సందుగారి శ్రీనివాస్, మధు నాగుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సూరారం జెడ్పీ పాఠశాలలో టెన్త్ టాపర్లకు సత్కారం

విద్యార్థులకు ఫ్రైజ్ మనీ అందజేస్తున్న దృశ్యం

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త : బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సూరారం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులై మొదటి, రెండవ స్థానాలు సాధించిన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ దేవి ఆధ్వర్యంలో నిర్వహించబడింది.విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి ఫ్రైజ్ మనీ, పుస్తకాలు, వాటర్ బాటిల్స్‌ను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రామ్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, దేవిడ్, చంద్రశేఖర్, విక్రమ్ రెడ్డి, ప్రసాద్, విక్రమ్, అనేఫ్, వికాస్, సాయి కుమార్, శివ, చంటి, సలీం తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

2బిహెచ్‌కే కాలనీలో పౌర హక్కుల దినోత్సవం

పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న అధికారులు

నిజాంపేట్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

బాచుపల్లి మండలం నిజాంపేట్ గ్రామంలోని 2బిహెచ్‌కే కాలనీలో ఈ నెల 30న పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారి ఉమా మహేశ్వర్ రెడ్డి, సహాయ కమిషనర్ జైరాజ్, నీటి సరఫరా శాఖ సహాయ ఇంజనీరు సౌమ్య, పోలీసు శాఖ అధికారులు, రెవెన్యూ పరిశీలకులు భాను చందర్, మల్లేశ్వర్ రావు, తపాలా శాఖ ప్రతినిధి పవిత్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై జరిగే అన్యాయాలు, వారి సంక్షేమ పథకాలు, పిల్లలకు ఉచిత విద్య, విదేశీ విద్యాపకాశాలపై అవగాహన కల్పించారు. అలాగే 2బిహెచ్‌కే కాలనీలో నీరు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుధ్యం వంటి సమస్యలతో పాటు శాంతిభద్రతల అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు.ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు గమనించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన తహశీల్దార్ రత్నం

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త: అమీర్‌పేట లోని కుమ్మరి బస్తీలో ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని అమీర్‌పేట తహశీల్దార్ డి. రత్నం ముఖ్య అతిథిగా విచ్చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎం. డి. అలీ పాషా, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు విజయభారతి, ప్రమీల, పారిజాత, జీహెచ్ఎంసీ సిబ్బంది వినయ్, రవి, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

బౌరంపేట్ సింహపురి కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం

దుండిగల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

బోర్‌వెల్‌కు మార్కింగ్ చేస్తున్న దృశ్యం

దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి ప్రత్యేక చొరవతో బౌరంపేట్ డివిజన్ పరిధిలోని సింహపురి కాలనీలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో కలిసి చర్యలు ప్రారంభించారు.గత నెలలో కాలనీ వాసులతో కలిసి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ని కలసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఐమాస్ లైట్లు, బోర్‌వెల్ వంటి ముఖ్య అవసరాలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ, వెంటనే వాటి మంజూరు కోసం ఆదేశాలు జారీ చేశారు.ఈ క్రమంలో గురువారం ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా ఏర్పాటు చేయనున్న రెండు ఐమాస్ లైట్ పోల్స్, ఒక బోర్‌వెల్‌కు కాలనీ వాసులతో కలిసి మార్కింగ్ చేయడం జరిగింది. దీని వల్ల కాలనీలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు సౌకర్యాలు కలగనున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్‌కి, అలాగే బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఇదిలా ఉండగా, కాలనీ ప్రజల ఫిర్యాదు మేరకు ఓపెన్ టు స్పేస్, పార్క్ స్థలాలపై జరిగిన అక్రమ కబ్జాలను అధికారులు తొలగించారు. అనంతరం ఆ ప్రాంతాలను పరిశీలించిన పీసరి కృష్ణారెడ్డి, వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆధీనంలో భద్రపరచాలని అధికారులను మీడియా ద్వారా కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోశాధికారి కొమ్ము ప్రశాంత్‌తో పాటు స్థానికులు నల్ల రాజిరెడ్డి, పరికి ప్రమోద్ కుమార్, సాయి కిరణ్, శివ, నరేందర్, మహేష్, తారక్, వెంకటరత్నం, అశోక్, సురేష్, ప్రవీణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

5న సామూహిక నిరాహార దీక్షలకు టిజిఈజెఏసి పిలుపు

నిజాంపేట్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మే 5వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో సామూహిక నిరాహార దీక్షలను నిర్వహించనున్నట్లు టీజీఈజేఏసీ గురువారం ఓ పక్రట ద్వారా ప్రకటించింది. 206 సంఘాలతో కూడిన సంయుక్త చర్య సమితి విస్తృత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు నాయకత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించనున్నారు.జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలు, సంఘాల బాధ్యులు ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం 100 మంది నిరాహార దీక్షలో పాల్గొనేలా, అలాగే కనీసం 3000 మంది సామూహిక నిరసనలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 63 సాధారణ డి మాండ్లతో పాటు నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రాధాన్య తగా ప్రదర్శించనున్నారు. వాటిలో జూన్ 2లోపు వేతన సవరణ కమిషన్ అమలు, పెండింగ్ బిల్లుల తక్షణ చెల్లింపు, ఆరోగ్య కార్డుల అమలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు వంటి అంశాలు ఉన్నాయి.లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ రావు విజ్ఞప్తి చేశారు.

ఎస్ఎస్‌సి ఫలితాలలో నాగార్జున విద్యార్థుల ప్రభంజనం

ఎస్ఎస్‌సిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో గుమ్మకొండ విటల్ రెడ్డి.

వనస్థలిపురం. ఏప్రిల్.30.ప్రభాతవార్త

పదవ తరగతి ఫలితాలలో నాగార్జున విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.590 మార్కులకు పైగా 4గురు,580 కి పైగా 29 మంది,570 కి పైగా 65 గురు,560 కి పైగా 129 మంది,550 కి పైగా 188 మంది,540 కి పైగా 297 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పూల బొక్కే అందజేసి అభినందించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత పర్యవేక్షణ పెట్టడంతో ,ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రజని విఠల్ రెడ్డి,సి.ఏ.ఓ.శేషా రావు,ఆకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్,ప్రిన్సి పాళ్ళు, ఇంచార్జి లు విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత

: మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు

మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:

ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకురుతుందని మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో ఆయనకు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మణికొండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మే నెల లో మహాసభ ఎన్నికల నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెగి రెడ్డి మదన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

బాధితులకు సెల్ ఫోన్లను అందజేస్తున్న ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:

సెల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు చాదర్ ఘాట్ పోలీసులు సెల్ ఫోన్లను అందజేశారు. ప్రజలు పోగొట్టుకున్న(11) మొబైల్ ఫోన్లను చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో విజయవంతంగా స్వాధీనం చేసుకున్నారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ లో జరిగిన కార్యక్రమంలో ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి సెల్ ఫోన్లను అసలైన యజమానులకు అప్పగించారు. దొంగతనం, ఎక్కడో పెట్టేసి మర్చిపోవడం, లేదా ప్రమాదవశాత్తు పోగొట్టుకోవడం వంటి కారణాల వల్ల ఈ ఫోన్‌లు పోయాయని, బాధితులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (దిని౹ళి) పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేశారు.ఈ ఫిర్యాదుల ఆధారంగా చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్లను గుర్తించి, బాధితులకు తిరిగి అప్పగించారు. టెలికమ్యూనికేషన్ల శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్, ఎప్పటి నుంచో పనిచేస్తోందని మలక్‌పేట్ ఏసీపీ కె. సుబ్బారామి రెడ్డి, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి కసాని తెలిపారు.తమ మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్న పౌరులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్, ఎన్‌సీఆర్‌పి పోర్టల్ ద్వారా లేదా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి ఫలితాలలో శ్రీ ఆదిత్య విద్యార్థుల విజయకేతనం

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్.సుధాకర్,సరితలు

వనస్థలిపురం. ఏప్రిల్.30.ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ ఆదిత్య కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.పరీక్ష రాసిన 75 మంది లో 74 మంది పాస్ కాగా,పి.అమూల్య 587,వి.జెశ్విత 581,కె.సహస్ర 580,ఆర్.సహస్ర 579,పి.విగ్నేష్ 578 మార్కులు సాధించి పాఠాశాలలో ప్రథమ స్థానంలో నిలిచారు.ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను పాఠాశాల చైర్మన్ డాక్టర్.కె.ఎస్.వి సుధాకర్,ప్రిన్సి పాల్ సరిత లు శాలువాతో, పూల బొకే లు అందజేసి అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, పాఠాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వేసవిలో చలివేంద్రాలను ఉపయోగించుకోవాలి : నేలపాటి

రైతు బజార్ సమీపంలో గల పార్కులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేలపాటి రామారావు.

వనస్థలిపురం. ఏప్రిల్.30.ప్రభాతవార్త. వేసవికాలంలో ప్రతి ఒక్కరు చలివేంద్రాల ను ఉపయోగించుకొని సేదతీరాలని హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని రైతు బజార్ సమీపంలో గల హెచ్.ఎం.డి. ఏ.పార్కు లో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తి ని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ఎల్.బి.నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ,మాజీ పార్లమెంటు సభ్యుడు, టి.పి.సి.సి. ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సూచన మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పరిసర కాలనీల ప్రతినిధులు, పాదచారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలి

: సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ యన్.ఆర్. బాబు

ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు పుష్ప గుచ్చాలను అందజేస్తున్న తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ నూతన డైరెక్టర్ బ్రిగేడియర్ యన్. ఆర్. బాబు తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త: మాజీ సైనికుల ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ యన్. ఆర్. బాబు పేర్కొన్నారు. తెలంగాణా సైనిక సంక్షేమ శాఖకు నూతన డైరెక్టర్ గా నియమితులైన బ్రిగేడియర్ యన్. ఆర్. బాబు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలను అందజేశారు . ఈ సందర్భంగా మాజీ సైనికులకు రావలసిన ఆర్థిక పరమైన అంశాల గురించి ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధములో పనిచేసిన వారికి ఆర్థిక సహాయం కొన్ని బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని, యుద్ధవితంతువులకు మరియు గ్యాలంటరి అవార్డు సాధించిన వారికి ఇవ్వాల్సి న పారితోషికం త్వరగా అందజేయాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి స్పందించి నిధులు విడుదల చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. అదేవిదంగా జిల్లా కార్యాలయాలకు రావలసిన బకాయిలను విడుదల చేయాలని కోరడం జరిగిందని, దానికి కూడా ఉప ముఖ్యమంత్రి వెంటనే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మాజీ సైనిక కార్పొరేషన్ తెలంగాణా లో ఏర్పాటు చేయుటకు సహకరించాలని, తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ లోని అధికారుల ఖాళీలను భర్తీ చేయుటకు ఫైనాన్స్ అనుమతి ఇప్పించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని వివరించారు. ఆర్థిక పరమైన అన్ని విషయాలలో ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతమని హామీ ఇవ్వడం జరిగిందని వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ సమావేశంలో లో రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ సర్కిల్‌లో త్వరలో పెండింగ్ పనులు ప్రారంభిస్తాం

-శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ

పెండింగ్ పనులపై శంషాబాద్ జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ సర్కిల్ లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ మేనేజర్ చంద్రకళ పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని అల్మాస్‌గూడ నుండి గుర్రంగూడ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో జయశంకర్ కాలనీ నుండి శ్రీశ్రీ హోమ్స్ కాలనీ మీదుగా శివాలయం వరకు అధ్వాన్నంగా ఉన్న మెయిన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నాదర్‌గుల్ డివిజన్ నేత నవారు మల్లారెడ్డి గురువారం జోనల్ కమీషనర్‌ను కాలనీవాసులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు దుస్థితిని జడ్‌సికి వివరిస్తూ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో తాను అప్పటి స్పెషలాఫీసర్ దృష్టికి రోడ్డు సమస్యను తెస్తే స్పందించిన ఆయన రోడ్డు ప్యాచ్ వర్కుల నిమిత్తం రూ.21 లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. అనంతరం టెండర్ ప్రక్రియ పూర్తి అయినా కాంట్రాక్టర్ చేసిన జాప్యం కారణంగా రోడ్డు పనులు జరగలేదని ఆయన జడ్‌సికి వివరించారు. ఆ తర్వాత కార్పొరేషన్ కాస్తా జిహెచ్ఎంసిలో విలీనం అయిన నేపథ్యంలో సదరు కాంట్రాక్టర్ రోడ్డు ప్యాచ్‌వర్కులకు సంబంధించిన రూ. 21 లక్షల నిధులను కేటాయిస్తే తక్షణమే పనులు ప్రారంభిస్తామని పేర్కొంటున్నాడని మల్లారెడ్డి జోనల్ కమీషనర్‌కు తెలియజేశారు. దీంతో స్పందించిన చంద్రకళ మాట్లాడుతూ గత రెండు నెలలుగా బడంగ్‌పేట్ సర్కిల్‌లో అవకతవకలపై జరుగుతున్న విచారణ త్వరలోనే పూర్తి అవుతుందనీ ఆ తర్వాత పెండింగ్ పనులన్నింటినీ మొదలు పెడుతామని మల్లారెడ్డికి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, జైహింద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో రియల్ ఎస్టేట్, చిట్టిల పేరుతో రూ.6.5 కోట్ల మోసం

-నిందితురాలు బద్దం జ్యోతి రెడ్డి రిమాండ్

వనస్థలిపురం.

ఏప్రిల్.30.ప్రభాతవార్త

అరెస్ట్ అయిన బద్దంజ్యోతి రెడ్డి(ఫైల్ ఫోటో)

రియల్ ఎస్టేట్ వ్యాపారం, చిట్టిల పేరుతో ఆరున్నర కోట్ల రూపాయలు మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న మహిళను వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హయత్ నగర్ మండలం కోహెడకు చెందిన బద్దం జ్యోతి రెడ్డి.(48). భర్త జనార్ధన్ రెడ్డితో కలిసి వనస్థలిపురం కమలనగర్‌లో నివాసం ఉంటున్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగాజ్యోతి రెడ్డి.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టించి మంచి లాభాలను పలువురికి ఇప్పించింది. దీంతో ఆమెపై నమ్మకం కలగడంతో పరిచయస్తుల వద్ద చిట్టీల వ్యాపారం నడిపించేది. అందరి నమ్మకం పొందిన జ్యోతి రెడ్డి సుమారు 6.5 కోట్ల రూపాయల వరకు వసూలు చేసింది. వారు తిరిగి డబ్బుల కోసం ఒత్తిడి చేయడంతో తప్పించుకు తిరుగుతుంది. మోసపోయామని గ్రహించిన బాధితులు వనస్థలిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. 2020 సంవత్సరము నుండి వనస్థలిపురం ఏరియాలో సుమారు 10 మంది వ్యక్తులను నమ్మించి దాదాపు 6.5 కోట్ల రూపాయలు మోసం చేసి పరారయ్యింది, మరికొంతమంది బాధితుల వద్దనుండి కూడా ఈమె రియల్ ఎస్టేట్ వ్యాపారము మరియు చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లుగా పోలీసులు తెలిపారు. ఎల్బీనగర్ డిసిపి బి. అనురాధ, సూచనలతో ఏసీపి పి. కాశీ రెడ్డి, పర్యవేక్షణలోద ర్యాప్తు చేసి మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు వనస్థలిపురం ఎస్ హెచ్ ఓ . ఎస్. రవిబాబు తెలిపారు. సబ్ ఇన్స్పెక్టర్ డి. నాగరాజు, మాధవి, వెంకట రాములు నిందితురాలిని పట్టుకోవడంలో చేసిన కృషిని అభినందించారు.

తమపై ఆరోపణలు అవాస్తవం

: బోయపల్లి రాఘువేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న బోయపల్లి రాఘువేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ సర్కిల్ లోని అల్మాస్‌గూడలో పార్కు స్థలాలు కబ్జా చేశామని తమపై చేసిన ఆరోపణలు, ఫిర్యాదుల్లో వాస్తవం లేదని బోయపల్లి రాఘువేందర్‌రెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు. తమపై రాజకీయ బురద జల్లేందుకు జరిగిన ప్రయత్నాలేనని వారు పేర్కొన్నారు. పాత లేఔట్ నిబంధనలను పక్కకు పెట్టి వాస్తవమైన ఆధారాలు లేకుండా రాజకీయ లబ్ధి కోసమే అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ఫిర్యాదులు చేశారని వారు తెలిపారు. ఫిర్యాదుదారుడు శూరకర్ణారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్న సర్వే నెంబర్లు, స్థల వివరాలు లే ఔట్ ప్లాన్లలోని వాస్తవాలతో ఏ మాత్రం సరిపోవడం లేదని వారన్నారు. శూరకర్ణారెడ్డి ఆరోపిస్తున్న ప్రకారం 1295 గజాల వివాదాస్పద స్థలం ఈ లేఔట్ పరిధిలోకి రాదని పాత రికార్డుల ప్రకారం తమకు కేటాయింపు జరిగిన స్థలాలు స్పష్టంగా ఉన్నాయనీ అందులో ఎలాంటి ఆక్రమణలు లేవని అన్నారు.

డివిజన్లలో బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ పర్యటన

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

స్పెషల్ డ్రైవ్‌లో అధికారులకు దిశానిర్దేశనం చేస్తున్న బడంగ్‌పేట్ డిసి సమ్మయ్య

జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలోని డివిజన్లలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య అధికారుల బృందంతో కలిసి మీర్‌పేట్, నాదర్‌గుల్, కుర్మల్‌గూడలలో పర్యటించారు. ఈ సందర్భంగా మీర్‌పేట్ పెద్ద చెరువు పక్కనే ఏర్పాటైన మైదానాన్ని పరిశీలించి అక్కడి సమస్యలు, సౌకర్యాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశనం చేశారు. అదే విధ:గా నాదర్‌గుల్‌లో జరుగుతున్న డీసిల్టేషన్ పనుల పరిశీలన జరిపి వాటికి సంబంధించి పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా పనులను సకాలంలో పూర్తి చేయాలని డిసి ఆదేశించారు. ఆ తర్వాత కుర్మల్‌గూడలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో నివాస భవనాలను సందర్శించి అక్కడి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా కనీస సదుపాయాలు, పారిశుధ్యం తదితర వాటికి సంబంధించి స్థానికులు దృష్టికి తెచ్చిన సమస్యలను సత్వరమే తీర్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ అభినయ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్, ఎఇఇలు గంగా ప్రసాద్, హరీష్‌లతో పాటు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి ఫలితాలలో లయోల విద్యార్థుల విజయ దుందుభి

వనస్థలిపురం ఏప్రిల్30,ప్రభాతవార్త :

వనస్థలిపురం లోని లయోల విద్యా సంస్థల విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించారు. 570 మార్కులకు పైగా 11 మంది,550 కి పైగా 14 మంది,500 కు పైగా 36 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను చాటారని లయోల విద్యా సంస్థల చైర్మన్ రంగినేని వెంకట్రావు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రతిభ గల ఉపాధ్యాయ బృందం ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపడం తో ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

టాపర్లుగా నిలిచిన లార్డ్స్ విద్యార్థులకు సన్మానం

రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన లార్డ్స్ విద్యార్థులను సన్మానించిన చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన బాలాపూర్ మండలంలోని లార్డ్స్ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన లార్డ్స్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల్లో బి.సహస్ర 600 మార్కులకు గాను ఏకంగా 589 మార్కులు పొంది రాష్ట్ర స్థాయి టాపర్ల సరసన నిలిచారు. అదే విధంగా జి.ప్రవళిక 585 మార్కులు, కె.సాయి కృతి 584 మార్కులు, శెట్టిపల్లి అక్షిత్ 581 మార్కులు, కె.తేజస్విని, చింతల రోషిణిలు 580 మార్కుల సాధించి ఫలితాల్లో సత్తా చాటారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలతలు టాపర్లకు పుష్పగుచ్ఛాలనిచ్చి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ సతీష్‌కుమార్, అన్ని బ్రాంచిల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

నాదర్‌గుల్ డివిజన్ సమస్యలు పరిష్కరించాలి: కేతావత్ బహుగుణ

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

బడంగ్‌పేట్ సర్కిల్‌లోని 57వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి ఇంచార్జి కేతావత్ బహుగుణ శంషాబాద్ జోనల్ కమీ షనర్ చంద్రకళను కోరారు. ఈ మేరకు ఆయన గురు వారం జోనల్ కమీషనర్‌ను కలిసి వినతి పత్రం సమ ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన జనాభా, ఇళ్లకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచాలనీ తద్వారా డ్రైనేజీ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అదే విధంగా కాలనీ ల్లో అంతర్గత రోడ్డు తదితర మౌళిక సదుపాయాలను కల్పించాలనీ మెరుగైన పారిశుధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కారం కాని పక్షంలో బిఎస్‌పి ఆధ్వర్యంలో ఆందోళన బాట పడుతామని ఆయన స్పష్టం చేశారు.

విహెచ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసి వైస్ చైర్మన్ శ్రీనివాస్

విహెచ్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడిగా మాజీ పార్లమెంటు సభ్యులు వి.హనుమంతరావును నియమించడం పట్ల హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ హర్షంవ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో విహెచ్‌ను కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో బిసి బిల్లు పెట్టే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి దశ అడ్మిషన్లు కొనసాగింపు

ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఫైల్ ఫోటో)

ఉప్పల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దోస్త్ రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయని దోస్త్ కోఆర్డినేటర్ జె.విశ్వనాదజ్ కుమార్ తెలిపారు. దోస్త్ మొదటి దశలో అడ్మిషన్ల కోసం విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా మే నెల 7 తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. విద్యార్థులు 12816 కోడ్ కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉప్పల్‌ను ఎంపిక చేసుకోవాలని, బి.ఎస్సీ, బి.కాం, బిఏలతో పాటూ మ్యాథ్స్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియలో విద్యార్థులకు సహాయం చేసేందుకు వేసవి సెలవుల్లో కూడా కళాశాల సిబ్బంది కార్యాలయంలోనే అందుబాటులో ఉంటారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం దోస్త్ సహాయకులను 8985927019, సమన్వయ కర్త 8686939844, ప్రిన్సిపల్ 9440476739లను ద్వారా సంప్రదించగలరని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు ఘన సత్కారం

రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ తదితరులు

రామంతాపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులలైన విద్యార్థులను గురువారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు, పట్టుదలతో చదువుకునే విద్యార్థులు ఉన్నారని, మండల పరిధిలో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. ఇక్కడి పాఠశాల విద్యార్థులు మొదటి రెండు ర్యాంక్ సాధించడంతో పాటు 551, 550 మార్కులు సాధించారని తెలిపారు. 500కు పైగా మార్కులను 12 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతతో పాటు నీలిమ, వసంత, కె. పద్మ లత, ఎస్. సంధ్య, కె.విష్ణు , ఎండి. అక్బర్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సందీప్, శ్రీధర్, జిల్లు, భాస్కర్, అశోక్, సచిన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ తెనే లక్ష్మి నరసింహస్వామి కళ్యాణోత్సవం

బీరప్పగడ్డలోని తేనె లక్ష్మినరసింహస్వామి ఆలయంలో కళ్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం.

ఉప్పల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : బీరప్పగడ్డలోని శ్రీ తేనె లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కళ్యాణోత్స వం నిర్వహించారు. ఆలయ కమిటి నేతలు సి.రఘుపతి రెడ్డి, సామల నాగరాజు, గోపు ఆనంద్, రాచకొండ శివ, పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, రాజశేఖర్ తదితరుల ఆధ్వర్యంలో కళ్యాణోత్స వ వేడుకలు నిర్వహించారు. ప్రతి ఏటా స్వామి వారి కళ్యాణోత్స వాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్స వాలకు పలువురు స్థానికులు తరలివచ్చారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ నేత ఇర్షద్‌ఖాన్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి దయతో బీరప్పగడ్డ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

పదవ తరగతిలో ప్రభంజనం సృష్టించిన కల్సా నారాయణ సిఓ ఉన్నత పాఠశాల

విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

ఇటీవల విడుదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో కల్సా నారాయణ సిఓ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సంవత్సరం పరీక్షల్లో అత్యధిక మార్కులతో విద్యార్థులు పోటీస్థాయిని మరింత పెంచారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాల నుండి 182 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణతతో పాటు మేధాన్ శ్రీరామ్ 597 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వరుసగా 596 మార్కులతో కిలారి లలిత్ 595 మార్కులతో డి.సాయిమనితేజ 594 మార్కులు, వరుణ్‌తేజ్ రాష్ట్రస్థాయిలో రెండవ, మూడవ, నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్రస్థాయిలో వరుసగా నాలుగు స్థానలు సాధించి పాఠశాల చరిత్రలోనే సువర్ణాక్షరాలతో ఫలితాలను లిఖించినారు. ఈ విద్యా సంవత్సరం 182 మంది విద్యార్థులలో 590కిపైగా మార్కులు 11 మంది విద్యార్థులు సాధించినారు. విద్యార్థులు సాధించిన ఈ విజయంపై నారాయణ గ్రూప్ డైరెక్టర్ రమానారాయణ, జిఎం గోపాల్‌రెడ్డి, పాఠశాల డీన్ మదనాచారి, ఏజిఎం సదాశివుడు, ప్రిన్సిపాల్ సురేష్ విద్యార్థులను అభినందించారు.ఈ ఫలితాలకు కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని, తల్లిదండ్రులను ప్రతి ఒక్కరిని పేరుపేరునా అభినందించినారు. ఈ ఫలితాలు భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలకు విద్యార్థులను ప్రేరేపిస్తాయన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

అవార్డు గ్రహీతలతో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ చిత్రంలో మల్లెల నర్సింగ్ రావు తదితరులు

తార్నాక, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

దళిత రత్న అవార్డు గ్రహీతలు జర్నలిస్ట్ సంతోష్ కుమార్, బీజేపీ నాయకులు కొరపాక అంజిలకు గురువారం నాచారం ప్రాంతంలో ఘన సన్మానం జరిగింది. బిజెపి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్ రావు కలిసి అవార్డు గ్రహీతలను సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గానికి దళిత రత్న అవార్డులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. సమాజ సేవలో నిబద్ధతతో ముందుకు సాగుతూ, అంబేద్కర్ భావజాలంతో ప్రజల్లో మమేకమై పనిచేస్తున్న అవార్డు గ్రహీతలు భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నాచారం డివిజన్ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్, అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్, ప్రకాష్, సాయి, ఉదయ్, వెంకటేష్, గోపి, మంజులవాణి, టీలు, ఎంఆర్పిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలి : చిలుక

కార్యక్రమంలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

కిశోర బాలికలో ఆరోగ్యం కోట శ్రద్ధ వహించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్ 50 యాడ్స్ వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే తల్లిదండ్రులకు, అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేయాలని సూచించారు. భద్రత గురించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కిశోర బాలికలు మానసికంగా, శరీరకంగా ఎదిగితేనే అన్ని రకాలుగా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శశికళ, సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి కందుకూరి సుదర్శన్, పెద్దవూర సైదులు, గుణగంటి రమేష్‌గౌడ్, మునిస్వామి, రాజు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు స్నేహపురి కాలనీలో హిందూ సమ్మేళనం

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీ మోర్‌సూపర్ మార్కెట్ వద్ద మే 2వ తేదీ శనివారం హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హిందువుగా జీవించు హిందువులని గర్వించు గడప లోపలే కులం గడప దాటితే హిందువులం అనే నినాదంతో హిందూ బంధువుల ఐక్యత కోసం హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం ఐదున్నర గంటలకు నిర్వహించే కార్యక్రమానికి జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచారకార్యదర్శి డాక్టర్ భాస్కరయోగి, చంద్రపురి కాలనీ కార్యవాహిక బెజవాడ గీత, అనంతుల రాజిరెడ్డి సవారీక్షతన హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హిందూ బంధువులు పెద్దఎత్తున తరలిరావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి ఆలయ కనుల పండువగా తిరు కళ్యాణోత్సవం

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

కళ్యాణోత్స వంలో పాల్గొన్న ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే ఉత్తర ద్వారం ఉన్న అరుదైన దేవాలయంగా ప్రసిద్ధి చెందిన జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీవారి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తిరు కళ్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఇఒ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో పురాతన కళ్యాణ మండపంలో ఏర్పాట్లు చేయగా ఆలయ ప్రధాన పూజారి డింగరి రామాచార్యుల బృందం వేద మంత్రోచ్చారణల మధ్య కళ్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించింది. తిరు కళ్యాణోత్సవంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబానికి చెందిన ట్రస్టీ ఛైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్, ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, పోరెడ్డి జంగారెడ్డి, చింతపట్ల జ్ఞానేశ్వరచారి, శివాలయం పూజారి రాకేష్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.